# కుంటాలకు మహర్దశ


ఓ వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ

- పల్లె ప్రగతితో సకల వసతులు
- మంచినీటి కష్టాలకు చెక్

కుంటాల, అక్టోబర్ 19 : కుంటాల గ్రామ పంచాయతీకి మహర్దశ వచ్చింది. ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంంతో సకల వసతులు సమకూరాయి. మిషన్ భగీరథ పథకంతో గ్రామ ప్రజలకు తాగునీటి కష్టాలు తొలగిపోయాయి. సీసీ రోడ్ల నిర్మాణంతో వీధులన్నీ పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. ప్రధాన రహదారికి ఇరు వైపులా హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్నా యి. సెగ్రిగేషన్ షెడ్డు, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. 4611 జానాభా ఉండగా పురుషులు 2263, మహిళలు 2348 మంది ఉన్నారు. రూ.99 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు.

– ఆసరా పింఛన్లు 1544 మందికి
– నాటిన మొక్కలు 3950
– ట్రాక్టర్ ట్రాలీ, ట్యాంకర్‌కు రూ. 8.89 లక్షలు
– రూ. 1.24 లక్షలతో డంప్ యార్డు నిర్మాణం
– శ్మశాన వాటిక నిర్మాణానికి రూ. 9,62,795.
– సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 48.25 లక్షలు
– రూ. 1.40 లక్షలతో క్రీడా ప్రాంగణం నిర్మాణం
– డ్రైనేజీ నిర్మాణానికి రూ. 28. లక్షల ఖర్చు
– మూడు లక్షల 84 వేలతో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు
– మన ఊరు–మన బడి కింద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల, డైనింగ్ హాల్ నిర్మాణం కోసం రూ. కోటి 64 లక్షలు, ప్రాథమిక పాఠశాలకు రూ. 26 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ప్రాథమిక పాఠశాలలో పనులు పూర్తయి అందుబాటులోకి రాగా ఉన్నత పాఠశాలలో పనులు వేగంగా నడుస్తున్నాయి.

–ఇటీవల ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ప్రకటించిన ప్రత్యేక అభివృద్ధి నిధి కింద గ్రామంలో లక్షతో ఓపెన్ జిమ్, 2 లక్షల రూపాయలతో గ్రామపంచాయతీ భవనం మరమ్మతు, రూ. ఏడు లక్షలతో గ్రామంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తామని సర్పంచ్ తెలిపారు.

**అవార్డులు..**

– మండల స్థాయిలో దీన్ దయాల్ ఉపాధ్యాయ సతత్ వికాస్ పురస్కార్ కింద 9 నేపథ్యాల్లో నాలుగు అవార్డులను కుంటాల గ్రామపంచాయతీ సొంతం చేసుకుంది.

**ఆదాయం..**

గ్రామంలో సేకరించిన చెత్తను అమ్మడం ద్వారా రూ. 65,450 ల ఆదాయం వచ్చింది. వర్మీకంపోస్టు తయారు చేసి 1275 కిలో గ్రాములు అమ్మగా రూ.4 వేలు వచ్చాయి. మిగితా వర్మీకంపోస్టు గ్రామంలోని మొక్కలకు చెట్లకు ఎరువుగా వాడుతున్నారు.


ఊరిలో నిర్మించిన వైకుంఠధామం

## గ్రామాభివృద్ధికి ప్రత్యేక చర్యలు



గ్రామాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గ్రామంలో ఇంతకు ముందు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది. కొత్త డ్రైనేజీలు నిర్మించి ఇప్పుడు ఆ సమస్యను పరిష్కరించాం. అలాగే వర్షాకాలం ప్రజలకు ఇబ్బంది కలగకుండా కొత్తగా సీసీ రోడ్లు నిర్మించాం. గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతకు పెద్దపీట వేశాం. అనేక సంక్షేమ కార్యక్రమాలు పేదలకు సర్కారు అందిస్తున్నది.

**- దొనికెన సమత, సర్పంచ్(కుంటాల)**

## ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు..



గ్రామంలో వీధి వీధిన తడి పొడి చెత్త సేకరించి వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నాం. నాటిన మొక్కలను సంరక్షిస్తూ స్వచ్ఛతకు పెద్దపీట వేస్తున్నాం. మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ సరఫరా చేస్తున్నాం. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్నాం. వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. సర్కారు గ్రామాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది.

**- రాజాబాపు, కార్యదర్శి(కుంటాల)**

# గ్రామాల్లో దాదాజీ జయంతి

కుభీర్, అక్టోబర్ 19 : కుభీర్‌తో పాటు మండలంలోని పార్డి(కే), పార్డి(బీ), పల్సి, నిగ్వ, మాలేగావ్, సాంగ్వి, చొండి, జాంగాం అమృతాలయం, తదితర గ్రామాల్లో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, పరమ పూజ్య పాండురంగశాస్త్రి అఠవలే జయంతిని (మనుష్య గౌరవ దినం) స్వాధ్యాయ భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో భక్తిఫేరి, భావఫేరి నిర్వహించి మాతృకేంద్రాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. దాదాజీ చూపిన బాటలో నేటి సమాజం పయనించాలని పలువురు వక్తలు సూచించారు. ఉదయం గ్రామాల్లోని వీధుల గుండా శ్లోకాలను ఉచ్చరిస్తూ ప్రభాతఫేరీ నిర్వహించారు.

# ఇంటింటా బీఆర్ఎస్ ప్రచారం


బీఆర్ఎస్ నాయకులకు గొర్రెపిల్లను బహూకరిస్తున్న గొల్లకుర్మలు

ముధోల్, అక్టోబర్ 19 : మండలంలోని బ్రహ్మణ్‌గాం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్ ఆధ్వర్యంలో గురువారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వం గొర్రెలను అందిస్తుండడంతో ఆర్థికంగా ఎదుగుతున్నామని, తాము బీఆర్ఎస్‌కే ఓటు వేస్తా మని గొల్ల కుర్మలు చెప్పారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి, పోతన్న యాదవ్, చింతకుంట సర్పంచ్ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ సంబురాలు



కుభీర్ : బతుకమ్మ ఆడుతున్న ఆర్యవైశ్య మహిళలు

కుభీర్, అక్టోబర్ 19 : మండల కేంద్రంలో గురువారం బతుకమ్మ సంబురాలను ఆర్యవైశ్య మహిళలు ఘనంగా నిర్వహించారు. బజారు గల్లీలో డీజే చప్పుళ్ల మధ్య బతుకమ్మ పాటలను అనుకరిస్తూ వేసిన కోలాటం, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ర్యాలీగా వెళ్లి స్థానిక వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. రెడ్డిశెట్టివార్ ప్రనీత, సునీత, జ్యోతి, నందా, స్వప్న, ప్రణాళి, తగిలెపెల్లి మనీష, మహిళలు పాల్గొన్నారు.

**భైంసాలో..**

భైంసా, అక్టోబర్ 19 : భైంసాలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు గురువారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్యాలు చేస్తి, కోలాటం ఆడి అనంతరం గడ్డెన్నవాగు ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. ఆర్య వైశ్య సంఘం మహిళలు పాల్గొన్నారు.


భైంసా : బతుకమ్మలతో మహిళలు

# యువతరంగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

కుభీర్, అక్టోబర్ 19 : మండలకేంద్రంలోని శ్రీరాంనగర్‌లో గల శివాలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపంలో గురువారం యువ తరంగ్ యూత్ ఆధ్వర్యంలో పూజారి రాజు మహారాజ్ అమ్మ వారికి సారె సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆవు నెయ్యితో కూడిన పాయ సం నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. పేండ్కర్ సతీశ్, బుర్పెల్లి మహేశ్, నరేశ్, రెడ్డిశెట్టి నిఖిల్, ప్రసాద్, రాజేందర్, రాజు, సాయినాథ్, యోగేశ్ సభ్యులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న యువకులు

# పండుగలను సంతోషంగా జరుపుకోవాలి

భైంసా, అక్టోబర్ 19 : పండుగలను ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు మురళీగౌడ్ పేర్కొన్నారు. గురువారం భైంసా పట్టణంలోని గట్టు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గట్టుమైసమ్మ ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో ఆయా కుల సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న మురళీగౌడ్